క్లుప్తంగా

విద్యార్థికి సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న జాన్సన్‌నాయక్

ఖానాపూర్: రాజస్థాన్ రాష్ట్రంలోని జోధ్‌పూర్ ఐఐటీలో సీటు సాధించిన పెంబి మండలం తాటిగూడకు చెందిన భీంరావు కుమారుడు వామన్‌రావును శనివారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పెంబి మండల అధ్యక్షుడు సల్ల నరేందర్‌రెడ్డి, గోవింద్‌నాయక్ తదితరులు ఉన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో



బోధన పరిశీలిస్తున్న డీఈవో రామారావు

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సోమవార్‌పేట్ బాలికల ఉన్నత పాఠశాలను శనివారం డీఈవో రామారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొమ్మిదో తరగతికి వెళ్లి ఆంగ్ల ఉపాధ్యాయుడు బోధిస్తున్న పాఠాలను పరిశీలించారు. విద్యార్థులతో ఆంగ్ల పదాలను బోర్డుపై రాయించి వారి ప్రగతి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయుడు బోధిస్తున్న తీరు, బోధనా పద్ధతులను, టీఎల్‌ఎం వివరాలను తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో నమోదు చేశారు. విద్యార్థుల ప్రగతి సమగ్ర వివరాలను హెచ్‌ఎం పరమేశ్వర్ డీఈఓకు వివరించారు. ఇందులో డీసీఈబీ సహాయ సెక్రటరీ భానుమూర్తి, పలువురు ఉపాధ్యాయులు ఉన్నారు.

పాఠశాలలో బోనాల సందడి

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామ వాసవి స్కూల్‌లో శనివారం బోనాల పండుగ నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నారులు అమ్మవారితోపాటు పోతరాజుల వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హర్షవర్ధిని, డైరెక్టర్ పుప్పాల సాగరికకృష్ణ తదితరులు ఉన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



తహసీల్దార్‌కు పరీక్ష చేస్తున్న వైద్యులు

దస్తురాబాద్: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ విశ్వంబర్ సూచించారు. శనివారం మండలకేంద్రంలో నిర్మల్‌లోని సాయి రాఘవేంద్ర దంత వైద్యశాల ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి 126 మందికి దంత పరీక్షలు నిర్వహించారు. పలువురికి మందులు అందించారు. శిబిరాన్ని సందర్శించిన తహసీల్దార్ దంతపరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో గంగాధర్, వైద్యులు కొమ్మ నరేశ్, రవళి తదితరులు పాల్గొన్నారు.

రేపు రేషన్‌కార్డుల పంపిణీ

కుంటాల: మండలంలోని లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన 776 కొత్త రేషన్ కార్డులను సోమవారం ఉదయం10 గంటలకు కుంటాల రైతువేదికలో ఎమ్మెల్యే రామారావు పటేల్ పంపిణీ చేస్తారని తహసీల్దార్ ఆడె కమల్‌సింగ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. లబ్ధిదారులు సకాలంలో హాజరవాలని ఆయన కోరారు.

విద్యా సామగ్రి పంపిణీ

కుంటాల: మండలంలోని అంబకంటి పంచాయతీలోని రాయపాడ్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం ఎక్సైజ్ ఎస్సై గంగాధర్ బ్యాగులు, పలకలు, పెన్నులు పంపిణీ చేశారు. తమ నాన్న ఇర్ల (అంజమాన్) గంగారాం జ్ఞాపకార్థం అందించినట్లు ఎక్సైజ్ ఎస్సై తెలిపారు. హెచ్‌ఎం శ్రీకాంత్ ఉన్నారు.

కార్గిల్ విజయ్ దివస్

భైంసాటౌన్: పట్టణంలోని వివేకానంద చౌక్‌లో శనివారం కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. పట్టణంలోని మాజీ సైనికుల ఆధ్వర్యంలో కార్గిల్ అమరవీరులకు నివాళులర్పించారు. ఆకుల గోపాల్‌దాస్, పిప్పెర మహేందర్, హన్మాండ్లు, కల్యాణ్‌కర్ సంభాజీ, సంజీవ్, మోహన్‌రావు, కార్తీక్, మల్లేశ్ ఉన్నారు.
దిలావర్‌పూర్: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో యువజన సంఘాలు, విద్యార్థులు కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. సిర్గాపూర్‌లోని ఫ్లేర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ నరసింహారెడ్డి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులు ఉన్నారు.
కుంటాల: మండలంలోని కల్లూరు వాసవి, కుంటాల సృజన విద్యానిలయం పాఠశాలల్లో కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. అమరవీరులకు నివాళులర్పించారు. గంగన్న, సాయిలు, శ్రీనివాస్, సంతోష్, జానకీరామ్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడుగుంత.. తీర్చేను చింత

- పెరుగుతున్న భూగర్భజలాలు
- ఇంటింటా నిర్మించుకోవాలంటున్న అధికారులు



మామడలో నిర్మించిన ఇంకుడుగుంత

మామడ: భావితరాలకు నీటి ఇబ్బందులు రాకుండా భూగర్భజలాలు పెరిగేలా రాష్ట్రప్రభుత్వం ఇంకుడుగుంతల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. వర్షపు నీరు వృథా కాకుండా భూమిలోకి ఇంకేలా ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడుగుంత నిర్మించుకోవాలని అధికారులు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. అధికారులు సైతం ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఇంకుడుగుంతలు నిర్మించి లాభాలను వివరిస్తున్నారు.

స్వచ్ఛభారత్ గ్రామీణ మిషన్ ఆధ్వర్యంలో..

స్వచ్ఛభారత్ గ్రామీణ మిషన్ ఆధ్వర్యంలో గ్రామాల్లో ఇంకుడుగుంతల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఉపాధిహామీ పథకం కింద జాబ్‌కార్డుదారులు తమ ఇంటి వద్ద నిర్మించుకునే ఇంకుడుగుంతకు రూ.6115 అందిస్తారు. సామాజిక స్థలాలైన చేతి పంపుల వద్ద ఇంకుడుగుంత నిర్మాణానికి రూ. 12,150, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో చేపట్టే నిర్మాణానికి రూ.18,020 అందిస్తున్నారు.

మండల లక్ష్యం 2758.. పూర్తయినవి 1967

మామడ మండలంలోని 27 గ్రామపంచాయతీల పరిధిలో ఇళ్ల వద్ద 2,758 ఇంకుడుగుంతలు నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించగా 1967 ఇంకుడుగుంతలను నిర్మించారు. కమ్యూనిటీలకు సంబంధించిన స్థలాల్లో 34 ఇంకుడుగుంతలు నిర్మించాల్సి ఉండగా 28 ఇంకుడుగుంతల నిర్మాణాలు పూర్తి చేశారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద 42 చోట్ల ఇంకుడుగుంతల నిర్మాణాలు లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటివరకు 34 చోట్ల పూర్తి చేశారు. ఇంకుడు గుంతల నిర్మాణాలను ప్రత్యేక బృందాల సిబ్బందితో తనిఖీ చేయించారు. 90 శాతం ఇంకుడుగుంతల నిర్మాణాలు పూర్తవగా మిగతావి నిర్మాణంలో ఉన్నాయి. ఇంకుడుగుంతలతో భూగర్భజలాలు పెరిగి నీటి సమస్య తీరుతుందని. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో ఇంకుడుగుంత నిర్మించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

నిర్మించుకున్నా..



నేను ఉపాధిహామీ పథకం కింద మా ఇంటి ఆవరణలో ఇంకుడుగుంత నిర్మించుకున్నా. వర్షపునీరు ఇంకుడు గుంతలోకి వెళ్లేలా ఏర్పాటు చేశా. ఈజీఎస్ కింద డబ్బులు అందించారు. భూగర్భజలాలు పెరిగాయి. వేసవిలోనూ మాకు నీటి సమస్య రాలేదు.

– తాళ్లపెల్లి భాగ్యలక్ష్మి, పొన్కల్

అవగాహన కల్పిస్తున్నాం..



ఇంకుడుగుంతల నిర్మాణాలతో కలిగే ప్రయోజనాలపై మండలవ్యాప్తంగా ఈజీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నాం. ఇంకుడుగుంతల నిర్మాణాలతో భూగర్భజలాలు పెరిగాయి. ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడుగుంత నిర్మించుకోవాలి.

– శివాజీ, ఈజీఎస్ ఏపీవో, మామడ

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. ఇతరులకు శాపం..!



రైస్‌మిల్లు ఆవరణలో నిలిచిన వరదనీరు

భైంసాటౌన్: 161బీబీ హైవే పనుల్లో అధికారులు, గుత్తేదారు నిర్లక్ష్యం కనిపిస్తూనే ఉంది. భైంసా పట్టణ శివారులోని భోకర్ చౌరస్తా సమీపంలో, దేగాం మార్గంలో రోడ్డు పనులు చేపట్టారు. అయితే వర్షపునీరు వెళ్లే ఏర్పాటు చేయకుండా వదిలేశారు. దీంతో స్థానికంగా ఓ రైస్‌మిల్లు ఆవరణలో వరద చేరి చెరువును తలపిస్తోంది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా తన మిల్లు మూసుకోవాల్సి వస్తోందని రైస్‌మిల్ యజమాని వాపోతున్నాడు. పారే దారి లేక నిల్వనీటితో దోమలు వృద్ధి చెంది ఇబ్బంది పడుతున్నామని స్థానిక దుకాణదారులు వాపోయారు. దీనిపై ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియడం లేదని.. అధికారులు నీరు సక్రమంగా వెళ్లేలా గుత్తేదారును ఆదేశించాలని కోరుతున్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

తానూరు(ముధోల్): ముధోల్ మండలం తరోడా కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ శనివారం కాలనీవాసులు బాసర–భైంసా రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. వారు మాట్లాడుతూ 10రోజులుగా నీటి బోరు మోటారు పనిచేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శికి విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. నిరసన తెలుసుకున్న పోలీసులు వచ్చి వారితో మాట్లాడారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తామనడంతో నిరసన విరమించారు.

ప్రయోగాత్మక విద్య అందించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్
- పాఠాలు చెప్పి విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఉన్నతాధికారి



కడెం: పాఠం చెబుతూ విద్యార్థిని ప్రశ్నలు అడుగుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

కడెం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రయోగాత్మక విద్య అందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్.. ఉపాధ్యాయులను ఆదేశించారు. అభ్యసన సామర్థ్యాలు పెరిగేలా చర్యలు తీసుకొని వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. శనివారం మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగది, స్టోర్ రూం, తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ టీచర్‌గా మారి ఏడో తరగతి విద్యార్థులకు భౌతికశాస్త్రంలోని దర్పణాలు పాఠం బోధించారు. విద్యార్థులను పలు ప్రశ్నలడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీవో అరుణ, ఎంఈవో షేక్ హుస్సేన్, హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శకుంతల తదితరులున్నారు.

పేదలందరికీ రేషన్ కార్డులు



రేషన్‌కార్డు పంపిణీ చేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్, ఎమ్మెల్యే బొజ్జు పటేల్

కడెం: ప్రజా ప్రభుత్వంలో పేదలందరికీ తెల్ల రేషన్ కార్డులు అందిస్తున్నట్లు కలెక్టర్ అభిలాష అభివన్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రత్యేక అధికారి హరికిరణ్‌తో కలిసి లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు శనివారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బొజ్జు మాట్లాడుతూ కొన్నేళ్లుగా ప్రజలకు రేషన్ కార్డులు లేక ఇబ్బందులను ఎదుర్కొన్నారన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో 20 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరిందన్నారు. పేదలు పస్తులు ఉండకుండా నాణ్యమైన ఆహారం మూడు పూటలా కడుపునిండా తినాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేపట్టిందన్నారు. కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అన్నింటికీ రేషన్ కార్డులే ప్రామాణికమన్నారు. కడెం మండలానికి 966 నూతన రేషన్ కార్డులు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారధి కళాజాత బృందాలు ప్రభుత్వ పథకాలు, సీజనల్ వ్యాధుల నియంత్రణ, తదితర అంశాలపై అవగాహన కలిగేలా ప్రదర్శనలు నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ పడిగెల భూషణ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిశోర్ కుమార్, డీఎస్‌వో రాజేందర్, తహసీల్దార్ ప్రభాకర్, ఎంపీడీవో అరుణ, రేషన్ డీలర్లు, అధికారులు పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డులతో ప్రభుత్వ పథకాలు

పెంబి: కొత్త రేషన్ కార్డులతో ప్రభుత్వ పథకాలు మరింత మెరుగ్గా అందుతాయని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మండలకేంద్రంలోని రైతువేదికలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి హరికిరణ్‌తో కలిసి లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం ఒక్కరికి కూడా రేషన్ కార్డు ఇవ్వలేదని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో రమాకాంత్, పలు శాఖల అధికారులు, నాయకులు ఉన్నారు.

గంజాయి నిల్వ చేసినా, విక్రయించినా జైలుకే



భైంసాలో తనిఖీ చేస్తున్న సీఐ గోపినాథ్



సోన్‌లో తనిఖీ చేస్తున్న సీఐ గోవర్ధన్ రెడ్డి



సారంగపూర్‌లో తనిఖీ చేస్తున్న ఎస్సై శ్రీకాంత్

- భైంసా పట్టణ సీఐ గోపినాథ్
- కిరాణ దుకాణాల్లో పోలీసుల తనిఖీలు

భైంసాటౌన్: గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు విక్రయిస్తే కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని పట్టణ సీఐ జి.గోపినాథ్ హెచ్చరించారు. ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు గంజా గస్తీ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని పాన్‌షాపులు, కిరాణ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి వంటి నిషేధిత మాదక ద్రవ్యాలు నిల్వ ఉంచినా, విక్రయించినా 100కు లేదా 8712659599 నంబర్‌కు సమాచారమివ్వాలని సూచించారు.

సోన్: మండలకేంద్రంలోని కిరాణ దుకాణాల్లో సోన్ సీఐ గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గంజా అమ్మిన, కొనుగోలు చేసిన వ్యక్తుల వివరాలు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం అందించిన వ్యక్తుల పేర్లు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ఏఎస్సై ప్రతాపరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాసర: గంజా గస్తీలో భాగంగా బాసరలోని రైల్వేస్టేషన్, బస్టాండ్, కిరాణ దుకాణాలు, పాన్‌షాపుల్లో ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సారంగపూర్: గంజా గస్తీలో భాగంగా శనివారం ఆయన వెంట ఎస్సై, కానిస్టేబుళ్లు ఉన్నారు. ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు మండలకేంద్రంలోని కిరాణ దుకాణాలపై దాడులు నిర్వహించారు. హెడ్‌కానిస్టేబుల్ రాములు, మాధవ్, ఇక్బాల్ తదితరులు ఉన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూరు, కుంటాల గ్రామాల్లో కిరాణ దుకాణాలు, పాన్ షాపుల్లో ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో ఏఎస్సై దేవన్న, సిబ్బంది ఉన్నారు.

తానూరు(ముధోల్): తానూరు, ముధోల్ మండలాల్లో కిరాణదుకాణాలు, పాన్‌షాపుల్లో ఎస్సైలు షేక్ జుబేర్, బిట్ల పెర్సిస్ తనిఖీలు నిర్వహించారు. మాదక ద్రవ్యాల గురించి తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కూలిన చెట్లు, మునిగిన పంటలు



లక్ష్మణచాంద: కేజీబీవీ సమీపంలో రోడ్డుపై చెట్టు



లోకేశ్వరం: ధర్మోరలో మునిగిన పంటలు



తానూరు: ఝరి(బి) వంతెన వరద నుంచి కూలీలను ఒడ్డుకు దాటిస్తున్న యువకులు



లక్ష్మణచాంద : పొట్టపల్లి సమీపంలో ..

లక్ష్మణచాంద: మండలంలో కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై చెట్లు కూలడంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. శనివారం మండలకేంద్రం సమీపంలోని కేజీబీవీ కళాశాల వద్ద రోడ్డుపై చెట్టు పడిపోయింది. పొట్టపెల్లి గ్రామ సమీపంలో మరో చెట్టు కూలింది. ప్రధాన రోడ్డుపై రెండు చోట్ల పడటంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ట్రాక్టర్ సాయంతో రోడ్డుపై పడిన చెట్లను తొలగించారు. ఇందులో ఏఎస్సై నారాయణరెడ్డి, పీసీలు భీమ్‌సింగ్, అశోక్ ఉన్నారు.

లోకేశ్వరం: మండలవ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు 9 మీ.మీ వర్షపాతం కురిసినట్లు తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్ తెలిపారు. శనివారం ఎడతెరిపి లేని వర్షంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. వివిధ గ్రామాల్లో పంటలు మునిగిపోగా.. పలు చోట్ల పొలాలు చెరువులను తలపిస్తున్నాయి.

తానూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి వాగులు, వంకలు, పొంగిపొర్లాయి. మండలంలోని ఝరి(బి) లోలెవల్ వంతెనపై నుంచి వరద ఉధృతంగా ప్రవహించడంతో ఝరి(బి), ఝరి(బి)తండా, మహారాష్ట్రలోని బోంతి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వ్యవసాయ పనులకు, ఇతర గ్రామాలకు వెళ్లిన వారిని పలువురు యువకులు వరద నీటి నుంచి వంతెన దాటించారు. ఎస్సై షేక్ జుబేర్ అక్కడికి వెళ్లి వరద పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ.. అత్యవసరమైతేనే బయటకు రావాలని సూచించారు.

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం కురిసిన వర్షాలకు వ్యవసాయ పనులు సాగలేదు. 16.2 మీ.మీ వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ సాయికృష్ణ తెలిపారు.

నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు



భైంసారూరల్: భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

లోకేశ్వరం: ఇందిరమ్మ ఇళ్ల విషయంలో రాజకీయాలు వద్దని.. నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తామని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని పుస్పూర్ గ్రామంలో 42 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. పనులు ప్రారంభించిన ఇళ్లు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. బీజేపీ మండల కన్వీనర్ సాయన్న, హౌసింగ్ డీఈ దయానంద్, ఎంపీడీవో వెంకటరమేశ్, ఎంపీవో సోలమాన్‌రాజ్, నాయకులు గన్ను వెంకట్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, చెతన్‌రెడ్డి, సురేశ్‌బాబు ఉన్నారు.

భైంసారూరల్: నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. మండలంలోని సిరాల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు, ఆర్థికంగా వెనుకబడిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.5లక్షల ఆర్థికసాయం అందిస్తాయన్నారు. అభివృద్ధి విషయంలో పార్టీలకు అతీతంగా ముందుకుసాగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

ఆలయాల్లో పూజలు



సూర్యాపూర్‌లో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

దిలావర్‌పూర్: మండలంలోని కదిలి శ్రీమాతా అన్నపూర్ణ పాపహరేశ్వరాలయం, కాల్వ శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయాల్లో శ్రావణమాస పూజలు నిర్వహిస్తున్నారు. కదిలిలో నిత్యాన్న కార్యక్రమాలు, అన్నపూర్ణేశ్వరీ దేవి చెంత కుంకుమార్చనలు కొనసాగుతున్నాయి. కాల్వ శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్లు నార్వాడి వెంకట్‌రావు, అంగూరి మహేందర్, ఈవో భూమన్న, సీనియర్ అసిస్టెంట్లు మాధవరావు, మనోహర్, ధర్మకర్తలు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

తానూరు: మండలంలోని బోరిగాం గ్రామ మహాదేవుడి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. చంద్రకాంత్‌యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని సూర్యాపూర్ శ్రీ రాజరాజేశ్వరాలయం, ఓలా, దౌనెల్లి శివాలయం, కుంటాల మహాదేవుడి, ఉమామహేశ్వర, ఆత్మలింగాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శివలింగాలకు అభిషేకం, బిల్వార్చన చేశారు, సూర్యాపూర్‌లో సాయికిరణ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

నేరాల నియంత్రణకే తనిఖీలు



అవగాహన కల్పిస్తున్న నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనా

నిర్మల్‌టౌన్: నేరాల నియంత్రణకే తనిఖీలు చేపడుతున్నామని నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనా అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని మహాలక్ష్మివాడ డబుల్ బెడ్ రూమ్ ప్రాంతంలో పోలీస్ కమ్యూనిటీ కాంటాక్ట్ (కార్డన్‌సెర్చ్) నిర్వహించారు. ఇందులో భాగంగా అనుమతులు లేకుండా నడుపుతున్న 70 ద్విచక్రవాహనాలు, 3 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలు, నిషేధిత మత్తు పదార్థాల వినియోగం, మద్యం సేవించడం, మైనర్ డ్రైవింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆస్తి సంబంధ నేరాల నిరూపణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. అపరిచితులు కన్పిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, పోలీస్ సిబ్బంది, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: నియోజకవర్గంలోని నిర్మల్ పట్టణం, నిర్మల్ రూరల్, సోన్, మామడ, లక్ష్మణచాంద, సారంగపూర్, దిలావర్‌పూర్, నర్సాపూర్(జి) మండలాలకు చెందిన 52 మంది లబ్ధిదారులకు రూ.12.50లక్షల విలువైన చెక్కులు మంజూరయ్యాయి. శనివారం జిల్లాకేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నిర్మల్ మండల పరిషత్ మాజీ అధ్యక్షులు సత్యనారాయణగౌడ్, మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.